## విద్యతో పాటు అన్ని కళల్లో నైపుణ్యం సాధించాలి


బాసరలోని ఆర్జీయూకేటీలో మాట్లాడుతున్న ఆధ్యాపకులు

బాసర, ఆగస్టు 30 : విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించడంతో పాటు అన్ని కళల్లో ప్రావీణ్యం సంపాదించాలని బాసరలోని ఆర్జీయూకేటీ ఇండక్షన్ ప్రోగ్రాంలో వక్తలు ప్రభాకర్‌రావు, విజయ్‌కుమార్, నాగసాయిలు అన్నారు. ఆర్జీయూకేటీలో శుక్రవారం నిర్వహించిన ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వీసీ వెంకటరమణ ఆదేశాల మేరకు క్రీడారంగం, సృజనాత్మక కళలు, కోర్‌వాల్యూస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమన్వయకర్త కిరణ్‌కుమార్, పవన్ శిరసాని, విద్యార్థులు పాల్గొన్నారు.




# రుణమాఫీ కోసం పాదయాత్ర


కప్పర్ల నుంచి తాంసి తహసీల్ కార్యాలయానికి పాదయాత్ర చేపట్టిన రైతులు

- ఆరు కిలోమీటర్లు నడిచి తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా, ఎమ్మార్వోకు వినతిపత్రం
- తాంసిలో కప్పర్ల రైతుల వినూత్న నిరసన


తాంసి తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ఆదిలాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తాంసి మండలంలోని కప్పర్ల గ్రామ రైతులు వినూత్నంగా నిరసన చేపట్టారు. వందమందికి పైగా శాంతియుత ప్రదర్శన చేపట్టారు. కప్పర్ల నుంచి ఆరు కిలోమీటర్ల దూరం నడిచి తాంసి మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మితో పాటు మండల వ్యవసాయశాఖ అధికారి రవీందర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం తమకు రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని తెలిపారు. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా పట్టాపాస్ పుస్తకం ఉన్న రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేస్తామని సీఎం చెప్పినా తమ గ్రామంలో చాలా మందికి రుణమాఫీ కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కప్పర్లలో ఒకటి, రెండు, మూడో విడుతల్లో రుణమాఫీ కాని రైతులు చాలామంది ఉన్నారని రుణమాఫీకి ఎందుకు కాలేదని అడిగితే బ్యాంకు అధికారులు తమ వద్ద ఉన్న వివరాలు ప్రభుత్వానికి పంపించినట్లు చెబుతున్నారని, వ్యవసాయాధికారులను అడిగితే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఆరు కిలోమీటర్లు పాదయాత్ర..

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ విషయంలో ఆదిలాబాద్ జిల్లాలో రైతుల నిరసనలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలతో శవయాత్రలు, దిష్టిబొమ్మల దహనం చేసి నిరసన తెలిపారు. శుక్రవారం వినూత్నంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. తలమడుగు మండలం రుయ్యాడి, బజార్‌హత్నూర్ పోలీస్ స్టేషన్‌లలో 15 మంది రైతులపై కేసులు నమోదయ్యాయి. దీంతో రైతులు తమ బాధను తెలియజేయడానికి పాదయాత్రను ఎంచుకున్నారు. గ్రామానికి చెందిన రైతులు తాంసి మండలం కప్పర్ల తెలంగాణ గ్రామీణ బ్యాంకులో, తాంసి కో ఆపరేటివ్ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారు. వీరిలో 70 శాతం మందికి మూడు విడుతల్లో రుణమాఫీ కాలేదు. దీంతో 100 మంది రైతులు కలిసి కాలినడకన ఆరు కిలోమీటర్లు నడుచుకుంటూ వచ్చి అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని నినాదాలు చేస్తూ తాంసి మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయానికి తరలివచ్చారు. గ్రామంలో మొదటి, రెండు, మూడు విడుతల్లో 200 మంది రైతులకు రుణమాఫీ రాలేదని, బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిబంధనల పేరిట రైతులకు రుణమాఫీని ఎగ్గొట్టే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

## మూడు నెలలుగా వేతనాలు లేవు..


ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మినీ అంగన్‌వాడీలు

- అంగన్‌వాడీల ఉద్యోగుల ధర్నా

ఎదులాపురం, ఆగస్టు 30 : మూడు నెలల నుంచి మినీ అంగన్‌వాడీ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. శుక్రవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ పీడీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మినీ అంగన్‌వాడీ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు ఇచ్చినప్పటికీ పాత వేతనాలే ఇస్తున్నారని, అవి కూడా సరిగా ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సు నీత, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, నాయకులు లింగాల చిన్నన్న ఉన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


క్యాంటీన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఇచ్చోడ, ఆగస్టు 30 : మహిళలు అన్ని రంగా ల్లో రాణించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ఎదుట ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో మహిళా శక్తి క్యాంటీన్ కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌ను క్యాంటీన్ మహిళలు సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు 12 రకాల యూనిట్లు అందిస్తున్నట్లు తెలిపారు. క్యాంటీన్‌కు బ్యాంక్ లోన్ రూ.3.10 లక్షలు వచ్చిందని, వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించి లబ్ధి పొందాలని సూచించారు. వచ్చిన నిధులు, ఖర్చు, విక్రయాలు, తదితర వివరాలు తెలుసుకున్నారు. క్యాంటీన్‌లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, వాడకూడదని, క్లాత్ కవర్లు ఉపయోగించాలని, ధర పట్టికను ఏర్పా టు చేయాలని సూచించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, తాజా మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతం రెడ్డి, మాజీ ఎంపీటీసీ గాడ్గె సుభాష్ ఉన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ


జాహెద్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ, ఆగస్టు 30 : కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీటీసీ జాహెద్ శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జాహెద్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఇచ్చోడ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, తాజా మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతం రెడ్డి, మాజీ ఎంపీటీసీ శివారెడ్డి, బోథ్ తాజా మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ శిరీష్ రెడ్డి, మైనార్టీ నాయకులు అబ్దుల్, సాబీర్, గణేశ్, నాయకులు పాల్గొన్నారు.

### రోడ్డు పనుల పరిశీలన..

ఇచ్చోడ మండల కేంద్రంలోని బైపాస్ నుంచి రోడ్డు నిర్మాణ పనులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు. వర్షపు నీరు రోడ్డుపై ఆగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సాయంత్రం లోగా తాత్కాలిక డ్రైన్ ఏర్పాటు చేసి రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించాలని తెలిపారు.

# హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

- ఆదిలాబాద్ జిల్లాలో విజృంభిస్తున్న వ్యాధులు
- వైద్యులు, సిబ్బందిని నియమించాలి
- మందుల కొరత లేకుండా చూడాలి
- ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోని జిల్లా ఇన్‌చార్జి మంత్రి
- మాజీ మంత్రి జోగు రామన్న


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా, విష జ్వరాలతో మరణాలు సంభవిస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క వైద్యసేవల విషయంలో అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించలేదని, ప్రజల ఆరోగ్యంపై పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక ప్రణాళికలతో వ్యాధుల నియంత్రణను సమర్థవంతంగా నివారించినట్లు తెలిపారు. డెంగ్యూ, మలేరియా కేసులు అధికంగా నమోదవుతున్నా అధికారులు సరైన లెక్కలు చూపడం లేదన్నారు. జిల్లాలోని వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు.

### వైద్యులను నియమించి.. మందులను అందుబాటులో ఉంచాలి..

జిల్లాలోని రిమ్స్‌తో పాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, మందుల కొరత ఉందన్నారు. మెడికల్ షాపుల్లో తెచ్చుకునేందుకు ప్రిస్కిప్షన్ రాసే వైద్యులపై వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో విజృంభిస్తున్న జ్వరాలపై వైద్యశాఖ మంత్రికి అవగాహన లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండేళ్ల కిందట జిల్లాలో 25 మంది వైద్యులను నియమించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలైనా ఒక్క డాక్టర్‌నూ నియమించలేదని విమర్శించారు. పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా చాలా వాటిల్లో ఒక్కరే ఉన్నారని తెలిపారు. పట్టణాలు, పల్లెల్లో అపరిశుభ్రత కారణంగా వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లెప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా కృషి చేశామని తెలిపారు. జిల్లాను దత్తత తీసుకున్నట్లు ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, మెట్టు ప్రహ్లాద్, యాసం నర్సింగరావు, సాజిదొద్దీన్, అలాల అజయ్, విజ్జగిరి నారాయణ, సెవ్వా జగదీశ్, కుమ్ర రాజు, నవాతే శ్రీనివాస్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగివున్న లారీని ఢీకొన్న కారు

- వివాహిత మృతి ● భర్త, పిల్లలకు గాయాలు


శ్రీదేవి (ఫైల్)

నేరడిగొండ, ఆగస్టు 30 : ఆదిలాబాద్ నేరడిగొండ మండలంలోని కొరిటికల్ (బీ) సమీపంలోని యూపీ దాబా వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో బెడద శ్రీదేవి (32) అక్కడికక్కడే మృతి చెందినట్లు నేరడిగొండ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఎస్ఐ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సిరికొండ మండలం కేంద్రానికి చెందిన ముత్యపు నాగన్న జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. పని నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం సిరికొండకు కారులో బయలు దేరారు. నేరడిగొండ మండలంలోని కొరిటికల్ దాబా వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొన్నది. దీంతో అందులో ప్రయాణిస్తున్న నాగన్న, భార్య శ్రీదేవి అక్కడికక్కడే మృతి చెందింది. కారులో ప్రయాణిస్తున్న నాగన్న తలకు తీవ్ర గాయాలు కాగా, కూతురు కుడి చేయి విరగగా, కొడుకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. లారీ పార్కింగ్‌లో కాకుండా రోడ్డుపై నిలపడంతోనే ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ వివరించారు.


ప్రమాద స్థలంలో నుజ్జునుజ్జయిన కారు




# అనాథ బాలికకు అండగా ఉంటాం

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్
- గురుకుల పాఠశాలలో చేర్పించిన అధికారులు


బాలికను గురుకుల పాఠశాలలో చేర్పించి బ్యాగు, పుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్ /తానూర్, ఆగస్టు 30 : తల్లిదండ్రులు మృతి చెందడంతో అనాథగా మారిన దుర్గను అన్ని విధాలుగా ఆదుకుంటామని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. తానూర్ మండలంలోని బెల్‌తరోడకు చెందిన అనాథ బాలిక మెరోళ్ల దుర్గను (11) శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు మండల అధికారులు తహసీల్దార్ లింగమూర్తి, ఎంపీడీవో అబ్దుల్ సమద్, పెద్దమ్మ అనిత, గ్రామస్తుల సమక్షంలో నిర్మల్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా బాలికకు స్కూల్ బ్యాగులు, కాస్మోటిక్స్, దుస్తులు, నోట్ పుస్తకాలను కలెక్టర్ అందజేశారు. మంచిగా చదవాలని, ఎలాంటి ఇబ్బంది ఉన్నా ఫోన్ చేసి చెప్పాలని ధైర్యం చెప్పారు. దుర్గ ఉన్నత చదువులు చదివేలా ప్రభుత్వం తరపున అన్ని వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాల తరగతి గదులు, వసతి గృహాలు, వంటగది, డైనింగ్‌హాల్, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట డీఈవో రవీందర్ రెడ్డి, తానూర్ ఎంపీడీవో అబ్దుల్ సమద్, తహసీల్దార్ రాజు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి దేవి మురళి, సగ్గం రాజు, శ్రీదేవి, ప్రిన్సిపాల్ గీత, సమాజీ సర్పంచ్ గోప సాయినాథ్, మాజీ ఎంపీటీసీ మధుపటేల్, నాయకులు అటల్ దేవిదాస్ మౌలాఖాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### నిర్మల్ వైద్య కళాశాల తనిఖీ

నిర్మల్ వైద్య కళాశాల కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, ప్రాక్టికల్, ఫిజియాలజీ, మ్యూజియం, వివిధ విభాగాలతో పాటు వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలలోని వైద్య విద్యార్థుల వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ దరహాస, దినేశ్‌కుమార్, జిల్లా దవాఖాన పర్యవేక్షకుడు సరోజ, సునీల్, తహసీల్దార్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

# మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా


నాగల్‌కొండ గిరిజన సంక్షేమ ఆశ్రమ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న ఖుష్బు గుప్తా

నార్నూర్, ఆగస్టు 30 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఉపాధ్యాయులు, అధికారులను ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా ఆదేశించారు. నార్నూర్ మండలంలోని నాగల్‌కొండలోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. తరగతి గతిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ, వారి ప్రతిభా సామర్థ్యాలను పరిశీలించారు. పోషక విలువలతో కూడిన భోజనాన్ని అందించాలన్నారు. ప్రతి విద్యార్థికీ చదవడం, రాయడం రావాలని సూచించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా పాఠశాలల్లో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి, పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉండడంతో సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఏటీడీవో క్రాంతికుమార్‌ను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నాణ్యమైన ఆహారాన్ని అందించకపోవడంపై మండిపడ్డారు. అక్కడి సిబ్బంది శాంతాబాయిపై చర్యలు తీసుకోవాలని సీడీపీవో శారదను ఆదేశించారు.

